క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని డోలాస్‌నగర్ అంబేడ్కర్ కాలనీలోని (డ్రైవర్స్ కాలనీ) డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు డాక్టర్ మానస మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించిందని చెప్పారు. ఇందులో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు ఉచితంగా అందించేందుకుఅన్ని వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారని, ఈ హాస్పిటల్ పరిధిలో ఉదయం 9.30 నుంచి జగన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.

ఇందిరానగర్‌లో..

తాడేపల్లిరూరల్: మంగళగిరి దేవస్థానం సెంటర్‌లో శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో ఇందిరానగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మపూడి గ్రామంలో స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో భాగంగా మూడోరోజు తుమ్మపూడి గ్రామంలో స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి.భవాని, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

మామిడి పంట దిగుబడిపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేషుని పాడు గ్రామంలో మామిడితోటల్లో వచ్చే చీడ పీడల నివారణపై రైతులకు ఆర్టికల్చరల్ విద్యార్థులు మంగళవారం అవగాహన కల్పించారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం, చిన్న లాటరిపి గ్రామ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల నాలుగో సంవత్సర విద్యార్థులు గ్రామీణ ఉద్యాన కృషి అవగాహనలో భాగంగా గుంటూరు లాం శాస్త్రవేత్తలు కేటాయించిన ఈప్రాంతంలో మామిడి పంట దిగుబడి, చీడ పీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు బి.స్వప్న, బి.సరిత, టి.తేజస్వి, కె.యశస్విని, కె.సౌమ్య, డి.ఉమామహేశ్వరి, కె.ఉదయశ్రీ, ఎస్.తోరణ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన ఉండాలి

తాడేపల్లిరూరల్: బాలల పరిరక్షణపై అవగాహన ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రాము గోడౌన్‌లో చిన్న రైలు ఫెర్టిలైజర్స్ ముఠా యూనియన్ కార్మికులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో చిన్న రైలు ఫెర్టిలైజర్స్ ముఠా మేస్త్రి ఎం.కరుణ, వి.రాజు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కృష్ణచైతన్యకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఆయన అసెస్మెంట్ ఆఫ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ ప్రాపర్టీస్ యుూజింగ్ వేస్ట్ కాఫర్ స్లాగ్ యూజ్ ఫైన్ యాగ్రిగేట్ యాన్ ఎక్స్‌పెరిమెంటర్ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ లభించిన అధ్యాపకుని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎనీ శ్రీనివాస్, డాక్టర్ ఏఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం



గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మంగళవారం గుంటూరులో పలు ప్రాంతాల్లో జరిగాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహ కార్యక్రమం జరిగింది. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఫెన్సింగ్ క్రీడలో అఖిల భారత స్థాయి పోటీలకు ఏపీ నుంచి ఎంపికైన క్రీడాకారిణి వి.అంజలికి క్రీడా ఉపకరణాలను కొనుక్కునేందుకు ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు సీడా పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ ద్వారా అందించారు. అందే వెంకటేష్, కొమ్మినేని రవితేజ, మురళీమోహన్, తల్లం శివ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సారథి సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ మురుగుడు,
వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని, బడుగు బలహీన వర్గాల వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండలంలో విజయవాడంలో అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం కోసం ఆనాడు అంబేడ్కర్ కృషి చేస్తే, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన చేస్తున్నారని అన్నారు. సమసమాజ స్థాపన కోసం అంబేడ్కర్ చేసిన కృషిని భావితరాలు గుర్తుంచుకునే విధంగా విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రూ.400 కోట్లతో ఏర్పాటు చేసి ఈనెల 19వ తేదీన సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అసమానతలు, కుల వివక్ష, పేదలు పడుతున్న ఇబ్బందులను రూపుమాపటానికి అంబేడ్కర్ నిత్యం శ్రమించారని, అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన చేస్తున్నారని అన్నారు. తండ్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలలను నెరవేరుస్తూ అంబేడ్కర్ ఆశయ సాధనను ఆచరణలో చూపుతూ విప్లవాత్మకమైన నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న కష్టాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. ఆయనకు అందరూ అండగా నిలవాలని అన్నారు. అనంతరం ప్రజా సంకల్ప యాత్ర పేరిట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు కలకోటి బోయేజ్, బెజ్జం రాజాజీ, బుల్లా రాజారావు, పచ్చల శ్యాంబాబు, ఈపూరి ఆదాం, రజనీకాంత్, ఉదయ భాస్కర్, జాలాది నాగేశ్వరరావు, నరసయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

లాం(తాడికొండ): నిపుణులైన వైద్యులను పల్లె చెంతకు తీసుకువచ్చి వైద్య సేవలను అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం లాం గ్రామ పంచాయతీలో నిర్వహించిన శిబిరాన్ని సందర్శించారు. రోగులను పరామర్శించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సర్పంచి షేక్ అబీదా, ఎంపీటీసీలతో కలిసి రోగులకు జగనన్న ఆరోగ్య సురక్షా కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్ బాబు, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ బి.భార్గవ్, డాక్టర్ ప్రతిమ, జిల్లా మాస్ మీడియా అధికారి కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శాస్త్రి పాల్గొన్నారు.

ఘనంగా జన్ భగీదారి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురంలో జన్ భగీదారి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో శృంగారపురం సర్పంచి కొండూరు సుధారాణి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీకి విఫలయత్నం

పట్నంబజారు: సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి విఫలయత్నం చేసిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని శీలంవారివీధిలో ఉన్న శ్రీతిరుమల మొబైల్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి షాపు తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. తాళాలు రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. షాపునకు సంబంధించి సీసీ ఫుటేజీలో నలుగురు వ్యక్తులు చోరీకి యత్నించినట్లు గుర్తించారు. షాపు యజమానికి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

పట్నంబజారు: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతగుంటూరు బాలాజీనగర్‌లో నివాసం ఉండే కొండేటి రామిరెడ్డి గుంటూరు నాజ్‌సెంటర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుంటారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అమ్మ ఒడికి సంబంధించి డబ్బులు జమ అయ్యాయా అంటూ, లైన్‌లో వలంటీరు ఉన్నారని నమ్మబలికి పలు మార్లు అకౌంట్ పరిశీలించాలని రామిరెడ్డిని అడగ్గా అకౌంట్, ఫోన్‌పేకు సంబంధించి పలు మార్లు ఓపెన్ చేశాడు. దీంతో రామిరెడ్డి ఖాతాలోని రూ. 46వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు వృద్ధురాలు అగ్ని ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఏసుభక్తనగర్‌లో నివాసం ఉండే మార్తమ్మ (75) ఈనెల 2న చలిమంట వేసుకుని దగ్గరగా మంచవేసుకుని నిద్రించింది. మంటలు ఎగిసిపడి మార్తమ్మపై పడడంతో అగ్ని ప్రమాదం జరిగింది. గమనించిన కుమారుడు శివకాశయ్య, స్థానికులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మార్తమ్మ మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

జీఎంసీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలించిన
మేయర్ కావటి మనోహర్



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకల నిర్వహణపై అధికారులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఏడాది నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయని, నగర ప్రజలు సంక్రాంతి సంబరాల ద్వారా తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకునేలా చేశామన్నారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. సంబరాలలో భోగి పళ్లు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు. సంబరాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, ప్రజారోగ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

పెదనందిపాడు: ఎరువుల షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడులోని మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, నాగులపాడు జీడీసీఎంఎస్ కేంద్రాన్ని పెదనందిపాడు, అన్నపర్రు ఆర్బీకే సెంటర్‌లను ఆమె సందర్శించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని, అనుమతి పత్రాలు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా మెయింటెన్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న విధంగా స్టాక్ ఉండాలని ఆమె యాజమానులు, సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎక్కడా ఓటు లేకపోతేనే కొత్త ఓటు

- ఆ విధంగా డిక్లరేషన్ తీసుకోవాలి
- తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతన ఓటు కోసం 20ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసున్నారని, తమకు ఎక్కడా ఓటు లేదని వారి నుంచి డిక్లరేషన్ తీసుకున్న తర్వాతనే పరిశీలించి ఓటు కల్పించడం జరుగుతుందని, ఇచ్చిన డిక్లరేషన్ మేరకు సమాచారం వాస్తవం కాకుంటే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం దరఖాస్తు చేస్తున్న ఫారం–6లను ప్రత్యేకంగా బీఎల్‌ఓలు, ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులు పరిశీలించిన రిమార్క్స్‌తోనే తదుపరి ఆమోదం కోసం పంపాలని ఆదేశించారు. డిసెంబర్ 10 తర్వాత తూర్పులో 4 వేలు, పశ్చిమ నియోజకవర్గంలో 2 వేలు ఓటర్ల నుంచి వివిధ క్లెయిమ్స్ అందాయని వాటి పరిష్కారానికి బీఎల్‌ఓల వారిగా రిపోర్ట్ పంపామన్నారు. ఎన్నికల విభాగానికి, రెవెన్యూ శాఖ నుంచి ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్‌లను డెప్యూట్ చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్రస్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, సూపరింటెండెంట్ సాంబశివ రావు, ఎన్నికల విభాగం డీటీ బి.భాస్కరావు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి జాన్ బాబు, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి వాసు, బీజేపీ నుంచి భాస్కర్‌రావు, ఆమ్‌ఆద్మీ నుంచి సేవాకుమార్, కాంగ్రెస్ నుంచి జానీబాషా పాల్గొన్నారు.

కత్తితో దాడి.. ఇరువురికి గాయాలు

చేబ్రోలు: బాకీ డబ్బులు వసూలు విషయమై జరిగిన వివాదంలో కత్తితో దాడి చేయటంతో ఇరువురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక చెరువులోపాలెంకు చెందిన మోపర్తి రమేష్‌కు వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన యువకుడితో డబ్బుల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు జీబీసీ రహదారి వద్ద ప్రత్యర్థులు కత్తితో దాడి చేయటంతో మోపర్తి రమేష్‌కు గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన వేమూరి పవన్‌కు గాయాలైనాయి. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంకల్పయాత్రతో జీవితాల్లో వెలుగులు



వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పలువురు ప్రజా ప్రతినిధులు

తాడికొండ: రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి బాటలు వేసిన ప్రజా సంకల్ప యాత్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కొనియాడారు. ప్రజా సంకల్ప యాత్ర పూర్తి అయి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కష్టాలను దగ్గరగా విని ప్రతి ఒక్కరి అవసరాలకు అనుగుణంగా నవరత్నాల పాలన ప్రవేశపెట్టి విజయవంతంగా పథకాలను నూరుశాతం అమలు చేశాకన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు రూరల్ జెడ్పీటీసీ సభ్యులు దాసరి కత్తిరేణమ్మ, కందుల సిద్దయ్య, సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తాళ్ళూరి వంశీ, మార్పుల శివరామిరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, తాళ్ళ శివనాగరాజు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో..

మండల కేంద్రమైన తుళ్ళూరులో ప్రజా సంకల్ప పాదయాత్ర చేసి ఐదేళ్లు పూర్తిఅయిన సందర్భంగా దిగంవత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ మరోసారి గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు కొప్పుల శేషగిరిరావు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చలివేంద్రం సురేష్, ఉపాధ్యక్షుడు కొయ్యగూర వినోద్, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్, మాజీ మండల అధ్యక్షులు బత్తుల కిషోర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, కాకర్ల నాగేశ్వరరావు, కొప్పుల ఆంద్రేయప్ప, డీజే శ్రీనివాసరావు, చనుమోలు రామారావు, ఆరేపల్లి జోజి, అన్నూరు జక్రయ్య, బెజ్జం రాంబాబు, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

తాడేపల్లిరూరల్: ఎస్టీయూ దుగ్గిరాల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సమావేశానికి ఉన్నం ప్రసాద్ అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులకై నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడి 75 సంవత్సరాలు అయిన నేపథ్యంలో మండల శాఖ వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఉన్నం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మునిపల్లి మోహనకృష్ణ, గౌరవాధ్యక్షులుగా మదన మనోహరబాబు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ బషీర్, గౌరవ సలహాదరుగా సుధాకర్ బాబు, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.రామచంద్రయ్య, కె.వి.సుబ్బారావు, బి.బ్రహ్మయ్య, బి. మరియదాసు, ఎ.జగన్మోహన్, ఎ.రాంబాబు, షేక్ రిజ్వానా బేగం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె. జోజప్ప, రాష్ట్ర కౌన్సిలర్ కె.వి.సుబ్బారావు, జిల్లా బాధ్యులు బి.మరియదాసు, ఎ.జగన్ పాల్గొన్నారు. వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా ప్రశాంత రావు, ఎన్నికల అధికారిగా ఎ.వి.గోపాలరావు వ్యవహరించారు.

ఫాతిమా షేక్‌కు ఘన నివాళి



ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి దుగ్గిరాలలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి సమాజంలో మహిళలపై జరుగుతున్న సామాజిక దురాచారాలను అరికట్టేందుకు ఒక్క విద్య ద్వారానే సాధ్యమని నమ్మి తన ఇంటినే మొదటి బాలిక పాఠశాలగా ఏర్పాటు చేసి సావిత్రీబాయి పూలేతో కలసి ఎనలేని కృషి చేశారని అన్నారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి ఫాతిమా సంక్షిప్త పరిచయాన్ని తమ రాష్ట్ర పాఠ్యపుస్తకంలో పొందుపరిచిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2022లో ఎనిమిదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జీవిత చరిత్రను చేర్చి తగిన గౌరవం కల్పించిందని వివరించారు. కార్యక్రమంలో షేక్ రషీద్, షేక్ ఖుద్దూస్, షేక్ జాన్ సైదా, షేక్ జిలాని, ఖాదర్ బేగ్, పఠాన్ మస్తాన్, కె.వెంకటేశ్వర్లు, బి.యల్లేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, డి.శ్రీధర్, దేవర నాయుడు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో ఉమామహేష్‌కు గోల్డ్ మెడల్



బంగారు పతకంతో విద్యార్థి

తాడేపల్లిరూరల్: రైఫిల్ షూటింగ్‌లో ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థి మరోసారి బంగారు పతకం సాధించాడు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరి కిషోర్ వివరాలు వెల్లడించారు. విద్యార్థి మద్దినేని ఉమా మహేష్ ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఇండోనేషియాలోని జకర్తాలో నిర్వహించిన ఆసియా రైఫిల్ ఛాంపియన్‌షిప్‌లో ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో పోటీలలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడని తెలిపారు. యూనివర్సిటీలోని క్రీడాకారులకు ప్రత్యేకమైన వసతులను కల్పించడమే కాకుండా ప్రోత్సాహకాలను, ఫీజు రాయితీలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన ఉమా మహేష్‌ను వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారథి వర్మ, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిశోర్ అభినందించారు.


వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థినులతో శ్రీనివాసరావు, రామకృష్ణప్రభు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి సేవా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గుంటూరు చలమయ్య–కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సంగడిగుంటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'మానవత్వాన్ని పెంపొందించు విద్యావశ్యకత' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ కేటగిరీల్లో విద్యార్థినులు బహుమతులు సాధించారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా విద్యాబోధనలో మానవతా విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారని, అటువంటి అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్, సుభద్ర పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థి ప్రతాప్‌రెడ్డికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థి అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ బాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రో స్ట్రిప్ ప్యాచ్ యాంటినా ఫర్ వైమ్యాక్స్–5జీ–డబ్ల్యూలాన్ అప్లికేషన్స్' అనే అంశంపై ప్రతాప్‌రెడ్డి పరిశోధన చేశారని తెలియజేశారు. ఆయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అంబవరం ప్రతాప్‌రెడ్డిని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.